


# ఇదో దారి

"విభావసు ఇంకా ఇంటికి రాలేదండి" కళారత్నం భర్తకి చెప్పింది.

"కారు వెళ్ళలేదా?"

"వెళ్ళింది. నాలుగున్నరకే ఎవరో తీసుకెళ్ళారుట"

రిసీవర్ అందుకుని ఓ నంబర్ తిప్పాడు అశ్వనీకుమార్ వెంటనే.

"హలో. కమీషనర్ గారున్నారా...నా పేరు అశ్వనీకుమార్.. అలాగే" రిసీవర్ చేత్తో మూయకుండానే భార్యని అడిగాడు.

"పోలీసులకి రిపోర్ట్ చేసావా?"

కళారత్నం తల అడ్డంగా వూపింది.

"హలో. అశ్వనీ కుమార్ స్పీకింగ్ వారం క్రితం మనం ఓ ఫంక్షన్ లో కలుసుకున్నాం... అవును...విభావసు నా ఆఖరి మనవడు కనబడటం లేదండి..." వివరాలు చెప్పాడు.

"ప్లీజ్. తెల్లవారు ఝామున కి వివరాలు తెలిసినా సందేహించకుండా వెంటనే ఫోన్ చేయండి థాంక్స్."

రిసీవర్ క్రేడిల్ మీద వుంచి అడిగాడు.

"వాడి ఫ్రెండ్స్ ఇళ్ళకి ఫోన్ చేసావా?" మౌనంగా తలవూపింది కళారత్నం.

ఫోన్ గణ గణ మ్రోగింది. రిసీవర్ అందుకొని 'హలో' అన్నాడు అశ్వనీకుమార్.

"విభావసు వున్నాడా?" అది గెండో కంఠం. కొద్దిగా కరుకుగా వుంది.

"లేడు. మీరెవరు?"

"నేనే"

ఫోన్ పెట్టేసారు అవతలివైపు.

విచిత్రం అనిపించింది అశ్వనీ కుమార్ కి.

మరో అయిదు నిముషాల తర్వాత మళ్ళీ ఫోన్ మోగింది.

"విభావసు వున్నాడా?"

అదే కంఠం. అవే మాటలు.

"లేడు మీరెవరో చెప్పనేలేదు?"

"చెప్తా." క్లిక్ మంది ఫోన్.

పోలీస్ కమీషనర్ ఇంటికి ఫోన్ చేసి జరిగింది చెప్పాడు భార్య సలహా మీద.

"డెవలప్ మెంట్స్ వుంటే చెప్పండి"

మళ్ళీ అయిదు నిముషాల తర్వాత ఫోన్ మోగుతుందని ఎదురు చూసారు కాని మోగలేదు. దాదాపు అరగంట తర్వాత మోగింది. రిసీవర్ని చటుక్కున అందుకుని "హలో" అన్నాడు అశ్వనీకుమార్.

"విభావసు మా దగ్గరవున్నాడు"

"ఎవరు మీరు? మీ దగ్గ రెందుకున్నాడు?"

క్లిక్.

అశ్వనీ కుమార్ మొహంలో ప్రవేశించిన భయాన్ని గుర్తించి అడిగింది కళారత్నం.

"ఏమిటి?"

"నాకు అనుమానంగా వుంది మనవాడు ఎవరో గుండాల చేతుల్లో చిక్కుకున్నాడని"

"ఏం కావాలి మీకు?"

"చెప్తా"

క్లిక్.

"విభావసు కిడ్నాప్ అయాడు. ఎన్ని లక్షలు అడుగుతారో!" చెప్పాడు అశ్వనీకుమార్.

"బ్లాక్ మనీ దాచలేక చస్తున్నాం. అదిచ్చయినా వాడ్ని విడిపించుకుందాం"

అయిదు నిమిషాల తర్వాత



ఫోన్ మోగగానే కళారత్నం అందుకుంది ఫోన్.

"ఎంత కావాలో చెప్పండి" అరిచింది కీచుగొంతుతో.

"అశ్వనీకుమార్ని పిలు"

కుమార్ రిసీవర్ అందుకున్నాక అడిగాడు ఆత్రంగా.

"ఎంత? ఎక్కడ?"

చిన్నగా నవ్వు.

"ఎంత కాదు. ఎక్కడ కాదు. నీకు సిగ్గులేదు, అరవైలో అరవైలా కనబడుతున్నా ఇరవైలా నటించడానికి? నీకు బయటి సినిమాలు ఎలాగూ లేవు రేపు ఉదయం నువ్వు హీరోగా నటించడానికి మొదలుపెట్టే నీ స్వంత చిత్రంలో నువు నటించనని మాటయిస్తే నీ పధ్నాలుగేళ్ళ [illegible] మనవడు బతుకుతాడు. లేదా వాడి శవం నీ యింటికి వస్తుంది. ఎప్పుడైనా నటించడానికి ప్రయత్నిస్తే నీ పదహారుమంది మనవలలో ఎవరో ఒకరు సఫా అవుతారని గుర్తుంచుకో!"

"నాకు నావాళ్ళ ప్రాణాలు ముఖ్యం. ఎవరు నువ్వు?"

"తెలుగు సినిమా ప్రేక్షకుల సంఘం నియమించిన సంఘ సేవకుడని" ❋